క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

జామి: శ్రావణ మాసం సందర్భంగా కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్


మాట్లాడుతున్న విశ్రాంత వీసీ ముత్యాలనాయుడు

కొత్తవలస: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారు ఉన్నత లక్ష్యాలను నిర్దే శించుకునేలా పాఠశాల స్థాయిలోనే ఆచార్య నన్నయ్య తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ చాన్సలర్ ముద్రు ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు అలవరుచుకోవాలన్నారు. హెచ్ఎం ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా ఫీవర్ సర్వే


కెల్లలో ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

గుర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బి.షర్మిళ గురువారం తెలిపారు. వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షలు చేపడుతున్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి


దివ్యాంగ చిన్నారికి చేస్తున్న ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 వెంకటరావు

గంట్యాడ: భవిత కేంద్రాల ద్వారాదివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పిల్లలు వినియోగించుకునేలా తల్లి దండ్రులు చూడాలని ఎంఈఓ-2 ఎస్.వెంకటరావు సూచించారు. మండలంలోని కొర్లాం గ్రామ భవిత సెంటర్‌లో దివ్యాంగ చిన్నారులకు గురువారం అందించిన ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసిన అనంతరం ఆయన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు ఇళ్ల వద్ద పిల్లలతో రోజూ వ్యాయామం చేయించడం వల్ల వారిలో కొంత మేర మార్పు వస్తుందని అన్నారు. ఫిజియోథెరపిస్టు, భవిత కేంద్రం సిబ్బంది జి.బి.కామేశ్వరి, సీహెచ్.రమేష్, సీహెచ్. శ్రావ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత


మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, విద్యార్థులు

శృంగవరపుకోట: ప్రతీ విద్యార్థి మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం మూడో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వన్ చైల్డ్- వన్ ప్లాంట్ కార్యక్రమాన్ని పట్టణంలోని డీపీఎల్ పాఠశాల విద్యార్థులు గురువారం నిర్వహించారు. డీపీఎల్ స్కూల్ అధినేత డాక్టర్ పి.వరలక్ష్మి, తహసీల్దార్‌తో కలిసి తహసీల్దార్, అగ్నిమాపక శాఖ కార్యాలయం, మున్సిఫ్‌కోర్టు,స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి, గాంధీపార్కు, ఆటోస్టాండ్, సాయిబాబా కోవెల, పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


లబ్ధిదారుకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి భరోసా కల్పిస్తున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గనివాడ గ్రామంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్య క్రమం నిర్వహించారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి ఎమ్మె ల్యే ప్రతి గడపకూ వెళ్లి పథకాలు అందుతు న్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామస్తు లు ఆయన దృష్టికి తీసుకువచ్చిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని. సచివాలయానికి అనుసంధానంగా పని చేస్తున్న గ్రామ వలంటీర్ల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీ తంగా పథకాలు ఇంటివద్దకే అందుతున్నాయని చెప్పారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయా న్నే తలుపుతట్టి పింఛన్ అందిస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం మనదేనని అన్నారు. విద్య, వైద్యరంగాల అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక సదుపా యాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు,ఎల్.కోట, జామి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ,గొర్లె రవికుమార్, ఎల్.కోట వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ రవ్వ శివశంకర్, గేదెల లక్ష్మి, నాయకులు గేదెల శాంత, పెదిరెడ్ల వెంకటేష్, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మదుపాడలో 'ఫ్యామిలీ డాక్టర్'


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలందించారు. 71 మందికి వైద్యసిబంది వివిధ వైద్య పరీక్షలు చేశా రు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య తనిఖీలు చేశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త లీలావతి, ఆశ కార్యకర్తలు గౌరి,సుశీలారాణి పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

చీపురుపల్లి: పట్టణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సీఎంఎస్ స్కిల్ సెంటర్ మేనేజర్ ఆర్.విజయ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో చదువుకున్న వారు ఈ మేళాకు రావచ్చని పేర్కొన్నారు. ఎంపికై న అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్ల రాస్తారోకో

శృంగవరపుకోట/లక్కవరపుకోట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడ ర్లు ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, ఎల్.కోట మండల కేంద్రంలోని అరకు-విశాఖ రోడ్డులో గురువారం రాస్తారోకో చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని, డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, దహన ఖర్చులకు రూ.15,000 చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు , గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, సీహెచ్.ముత్యాలు, ఎస్.చిన్నారావు, బి.గంగరాజు, గోపి, ఈశ్వరరావు, చంద్రయ్య, మురళి, ఎర్నాయుడు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌లో నిర్లక్ష్యం వద్దు


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రత్నం

మెరకముడిదాం: ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధార్ కార్డును ప్రతీ పదేళ్లకు ఒకసారి అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుందని, ఆధార్ అప్‌డేట్‌లో ప్రజలు నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని ఎంపీడీఓ ఎం.రత్నం సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ఇంత వరకుఎంతమంది ఆధార్ కార్డులు అప్‌డేట్ చేశారు..?, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సహాయం


గుర్ల: మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల


వేపాడ: మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన గేదెల అప్పలనాయుడు బుధవారం మృతి చెందారు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు గురువారం రూ.10 వేలు అందజేశారు. సచివాలయ కన్వీనర్ బూర్లె శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో...

వేపాడ: మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన నిమ్మిడితల్లి ప్రసాద్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మృతుడి భార్యకు వైఎస్సార్‌బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలను డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి గురువారం అందజేశారు. సర్పంచ్ గోటివాడ దేవి, ఉపసర్పంచ్ కండిపల్లి పెదరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మార్చురీ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న వంశీకృష్ణ, ఐఓసీఎల్ ప్రతినిధులు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ప్రతినిధులు గురువారం సందర్శించారు. ఆస్పత్రికి మార్చురీ గది లేకపోవడంతో పాత ఆస్పత్రి ఆవరణలోని మార్చురీ గదిని వినియోగిస్తున్నారు. సమస్యపై స్పందించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఐఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నతాధి కారులతో చర్చించారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ)లో భాగంగా రూ.50 లక్షలు వెచ్చించి మార్చురీ గది నిర్మించాలని ఐఓసీఎల్ అధికారులను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఐఓసీఎల్ ఉన్నతాధికారులు తమ కంపెనీ ప్రతినిధులను ఆస్పత్రి పరిశీలనకు పంపించారు. వారితో ఎంపీ తనయుడు వంశీకృష్ణ కలిసి సీహెచ్‌సీ ఆవరణలో మార్చురీ గది నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

బొండపల్లి: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసేందుకు ఉమ్మ డి విజయనగ రం జిల్లాకు శుక్రవారం విచ్చేయచున్నారని, ఈ పర్యటనను అంతా కలిసి విజయవంతం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ బొండపల్లి మండల ప్రజలను కోరారు. గురువారం వారు విలేక రులతో మాట్లాడుతూ మెంటాడ మండలంలోని చినమేడపల్లి వద్ద గిరిజన యూనివర్సిటీకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని, అనంతరం దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. సీఎం పర్యటనకు బొండపల్లి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జయహో ఇస్రో...


శృంగవరపుకోట: ఎస్.కోటలో జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



శృంగవరపుకోట: ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు


చీపురుపల్లి: ఇస్రో అక్షరమాలగా కూర్చొని శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతున్న కళాశాల విద్యార్థులు

శృంగవరపుకోట: జయహో ఇస్రో... జయహో భారత్ నినాదాలతో ఎస్.కోట పట్టణం గురువారం మారుమోగింది. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు భారత జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. భవానీనగర్‌కి చెందిన డాక్టర్ వరలక్ష్మి స్కూల్ విద్యార్థులు జాతీయ పతాకాలు పట్టుకుని స్థానిక దేవీ జంక్షన్ నుంచి షిర్డీ సాయి ఆలయం వరకూ ర్యాలీ చేశారు. వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ పి.వరలక్ష్మి, డీపీఎల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.రమేష్, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ధర్మవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు జాతీయ పతాకాలు చేతపట్టుకుని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు వందనం

చీపురుపల్లి: చంద్రయాన్-3 మిషన్ ఘన విజయంతో ఇస్రో శాస్త్రవేత్తలు భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబు అన్నారు. చంద్రయాన్-3 విజయానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు అభివందనం తెలుపుతూ ఆ కళాశాలలో విద్యార్థులు గురువారం 'ఇస్రో' పేరు ఆకారంలో కూర్చుని ప్రదర్శన ఇచ్చారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

గజపతినగరం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ఎం.వెంకటాపురం గ్రామంలోని శ్రీకృష్ణ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆ గ్రామం నుంచి గజపతినగరం జాతీయ రహదారి మీదుగా ర్యాలీ కొన సాగింది. కళాశాల అధ్యాపక సిబ్బంది ఎ.రాంబాబు, టి.నాగేంద్రబాబు, కె.జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

సమగ్ర సస్యరక్షణపై దృష్టి


గజపతినగరం: శ్రీరంగరాజపురంలో బెండ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


జామి: లక్ష్మీపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్


శృంగవరపుకోట: సంతగవిరమ్మపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవీంద్ర

గజపతినగరం: ఖరీఫ్ వరితో పాటు కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులంతా సమగ్ర సస్యరక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వి.శ్రీనివాసరావు,డాక్టర్ ఎం.పార్వతి సూచించారు. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో కూరగాయల పంటలను గురువారం వారు పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. బెండ పంటకు సోకే పచ్చదోమ, తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ మందును పిచికారీ చేయాలని చెప్పారు. మిరప పంటను ఆశించే తామర,ఆకుముడత పురుగుల నివారణకు 2మిల్లీ లీటర్ల పిప్రోనిల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, పత్తి పంటకు సోకే పచ్చదోమ, తెల్లదోమల నివారణకు 2 గ్రాముల ఎసిటామిప్రిడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.స్వాతి, వీఏఏలు వినయ్,మస్తాన్ తదితరులు వారి వెంట ఉన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో ఏఓ కె.రవీంద్ర నేతృత్వంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులను, మిత్ర, శత్రు పురుగులను గుర్తించడాన్ని వివరించారు. వరిలో ఆకుల చివర్ల కత్తిరింపు, అధిక సాంద్రతలో ఎక్కువ పిలకలు వచ్చిన వాటిని తీయడం, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వీఏఏలు రవిచంద్రకుమార్, వివేక్, జెడీబీఎన్‌ఫ్ సిబ్బంది రామలక్ష్మి, ఈశ్వరమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోతాదు మించితే అనర్థమే

జామి: పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు మోతాదు మించి ఎరువులు, పురుగులు మందులు వినియోగించడం వల్ల పంటల దిగుబడిపై, ఆ పంటను ఆహారంగా తీసుకున్న వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఏఓ కిరణ్‌కుమార్ అన్నారు.మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ కరీం, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్


మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు

బొండపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022–2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టిన పనులపై పారదర్శకంగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆడిట్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, డీఆర్పీలు, ఎస్సార్పీలతో ఆడిట్‌పై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు క్షేత్రస్థాయిలో చేసిన పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు, ఎస్సార్పీలు పరిశీలించాలని సూచించారు. వేతనదారులతో మాట్లాడి వేతనాలు అందాయా లేదా అనే విషయాన్ని ఆరా తీయాలని చెప్పారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏపీఓ బి.కృష్ణవేణి, ఎస్సార్పీ ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో బహుళ ప్రయోజనాలు


డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

జామి: బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్) పీడీ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. మండలంలోని కలగాడలో గ్రామానికి చెందిన రైతు బి.భవాని వ్యవసాయక్షేత్రంలో అమర్చిన బిందుసేద్యం పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బిందుసేద్యం విధానంలో తక్కువ నీటితో పంటలను సాగు చేయవ చ్చని, దిగుబడులు కూడా బాగుంటాయని, పంటకు డ్రిప్ ద్వారానే ఎరువులను పంపించవచ్చని చెప్పారు. సన్న,చిన్నకారు రైతుల కు 90శాతం రాయితీపై ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్ పరికరాలు అందిస్తోందని, అయిదు ఎకరాలు పైబడిన రైతులకు 55 శాతం రాయితీపై పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోట, జామ, చెరకు, కూరగాయ లు తదితర పంటలకు ఈ విధానం అనువుగా ఉంటుందన్నారు. పరికరాలు అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఏఏ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- మెప్మా బజార్ ప్రారంభం


స్టాల్స్‌ను సందర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లోని ఉత్పత్తులను కోలగట్ల పరిశీలించి, డ్వాక్రా మహిళలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన కూడలైన కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా జగనన్న మహిళామార్టులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం

విజయనగరం: సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారంలో ఐదు సచివాలయాల పరిధిలో సుమారు 25 వేల మంది ప్రజలకు వైద్యం అందించేందుకు రూ.98 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్‌సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. నగరానికి ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరవ్వగా.. వీటిలో ఇదివరకే రెండు కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. తాజాగా వీటీ అగ్రహారంలో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.